క్లుప్తంగా

చిలుకూరులో జగనన్న స్వచ్ఛ సంకల్పం

ఉండి: జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా చిలుకూరు గ్రామ పంచాయితీలో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో జగనన్న లేఅవుట్, డంపింగ్ యార్డు, ప్రధాన గ్రామంలోని పలు ప్రాంతాల్లో ప్రొక్లెయినర్ సహాయంతో చెత్తా చెదారాన్ని తొలగించి రోడ్లను శుభ్రం చేయించారు. అలాగే నీరు నిలువ ఉండే ప్రాంతాల్లో మురుగునీటి పారుదలకు అడ్డుగా ఉన్న ఆటంకాలను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాత్వీకం పాల్గొన్నారు.

పుష్పరాజ్‌కు సత్కారం

సాక్షి, భీమవరం: మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్ప రాజ్‌కు అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు, మకర సంక్రాంతి జాతీయ అవార్డు రావడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమవరంలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పుష్ప రాజ్‌ను సత్కరించారు. ప్రజలకు సేవలందిస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతల జ్ఞాన ప్రకాష్, సంధి జయరాజు, కోలాటి ప్రసాదరావు, చిల్లి రాజ్ కుమార్, పిట్టా వినోద్ కుమార్, గొర్ల గోపి, దాసరి చిరంజీవి, చిగురుపాటి రాజేష్, నన్నేటి నాగరాజు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆస్తి పన్నులను యజమానులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ అన్నారు. భీమవరం పురపాలక సంఘంలో గురువారం వార్డ్ అడ్మిన్ సెక్రెటరీలతో మునిసిపల్ కమీషనర్ సబ్బి శివరామకృష్ణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని వార్డుల్లోని ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నుల సకాలంలో కట్టించాలని సూచించారు. నిర్ణీత గడువు దాటితే ఫెనాల్టీలు విధిస్తామని హెచ్చరించారు.

పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు పూర్వ విద్యార్థులు కలిసి మైక్ సెట్, బ్యాటరీ ఇన్వెర్టర్ బహుకరించారు. 1995–96 బ్యాచ్ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పూనుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పి.మహేష్ మాట్లాడుతూ పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ అభినందనీయమని అన్నారు. రూ.50 వేలు విలువ చేసే మైక్ సెట్, బ్యాటరీ ఇన్వెర్టర్ బహూకరించామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో కె. శ్రీనివాస్, ఎం.వీరాస్వామి, పిల్లి శ్రీనివాస్, పి.గాయత్రీ, జి.వెంకటలక్ష్మి, ఈ.కళ్యాణ్, ఎం.నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

7న ఐటీఐలో జాబ్‌మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో 7వ తేదీ మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, డైకిన్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి, ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ మేళా ద్వారా క్వాలిటీ,ప్రొడక్షన్ విభాగాల్లో 50 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. మెకానికల్, ప్రొడక్షన్, ఆర్ఏసీ, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్స్ట్రుమెంటేషన్ విభాగాల్లో 20201–23 మధ్య కాలంలో డిప్లమో చేసిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల 24 ఏళ్ళలోపు వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 86885 94244 కు ఫోన్ చేయాలని కోరారు.

కళాశాలలు అభివృద్ధి చెందాలి

సాక్షి, భీమవరం: నూతన విద్యా విధానంలో భాగంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో అన్ని విభాగాలు అభివృద్ధి చెందాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ సూచించారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సృజనవాటికలో చిరుధాన్యాలతో చేస్తున్న పలు రకాల వంటకాలు, పురాతన కాలం నాటి వస్తువులను ఆయన పరిశీలించి అభినందించారు. దీంతోపాటు నూతనంగా ఏఐసీటీఈ సహకారంతో ఏర్పాటు చేసిన ఐడియా ల్యాబ్ టెక్నాలజీ సెంటర్ తదితర విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరుగుతున్న అభివృద్ధిని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతి రాజు ఐఐటీ డైరెక్టర్‌కి వివరించారు. అనంతరం కళాశాల వివిధ విభాగాలు హెడ్స్, డీన్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులను సమాజ అవసరాలను తీర్చే విధంగా అన్ని రంగాల్లోనూ వారిని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల తరుపున ఘనంగా సత్కరించారు.

అలరించిన మ్యూజికల్ నైట్

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు అడబాల సత్యనారాయణమూర్తి కేశనపల్లి వారితో భక్తిరంజని, సాయంత్రం 4 గంటలకు జై శ్రీ దుర్గా మల్లేశ్వరి జ్యోతిషాలయం పాలా దుర్గా ప్రసాద్ సిద్ధాంతి పెన్నాడ వారితో దేవి భగవత ప్రవచనం , సాయంత్రం 5 గంటలకు శ్రీరామభక్త సమాజం గిరిశ రవి హైదరాబాద్ వారితో భక్తిరంజని, రాత్రి 7 గంటలకు ఉషశ్రీవాణి కళానికేతన్ రాజమండ్రి వారి పంచ రత్నములు నాటిక ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆదిలక్ష్మి అలంకరణలో అలంకరించారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

సాక్షి, భీమవరం: దాళ్వా సాగుకు సంబంధించి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంతుల వారి విధానంలో శివారు పంట భూములకు సైతం సాగునీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా వీరవాసరం, తోకలపూడి, కొణితివాడ, మత్స్యపురి గ్రామాలకు సంబంధించి వంతుల వారి విధానంలో రైతులు ఇబ్బందులు పడకుండా ముందుగానే అధికారులు ఆ ప్రాంతాలకు వెళ్లి రైతులతో కలిసి పర్యవేక్షణ చేయాలని, సమస్య ఉంటే వెంటనే దానిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కూడా రైతులకు సాగు విషయంలో ఏనాడు కూడా సాగునీటి ఇబ్బందులు తలెత్తలేదని గుర్తు చేశారు. సాగును దృష్టిలో పెట్టుకొని ముందుగానే నీటి ఎద్దడి లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఏటా కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం కూడా దాళ్వా సాగుకు పూర్తిస్థాయిలో నీరు అందించే విధంగా పనిచేస్తున్నామని అన్నారు. సాగునీటి సమస్యలు తలెత్తితే రైతులు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ డీఈ కె.శ్రీనివాస్, ఏఈలు వినయ్ కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

గడప గడప అభివృద్ధి పనులపై సమీక్ష

సాక్షి, భీమవరం: గడపగడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేయడంతో ఆ నిధులతో ప్రస్తుతం జరుగుతున్న పనులపై ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్ అధికారులతో ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాను పర్యటించిన గ్రామాలలో సచివాలయ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన పనులను వేగవంతం చేశామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ ఈ లోకేశ్వరరావు, డీఈ రామరాజు, జేఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకారావు, పంచాయతీరాజ్ జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠినచర్యలు

కాళ్ల: మట్టి వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కాళ్ల తహసీల్దార్ టీఏ కృష్ణారావు అన్నారు. కృష్ణాజిల్లా సున్నంపూడి నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న 10 ట్రాక్టర్లను జువ్వలపాలెం గ్రామం వద్ద కాళ్ల ఎస్సై ఆర్.మల్లికార్జున రెడ్డి గురువారం సీజ్ చేశారు. వీటిని తహసీల్దార్ కోర్టుకు పంపగా సంబంధిత మట్టి వ్యాపారులకు కాళ్ల తహసీల్దార్ కృష్ణారావు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజలకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ మట్టి రవాణా చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రోడ్లపై మట్టి పడకుండా ప్రతి ట్రాక్టర్‌పై బరకం కచ్చితంగా ఉండాలన్నారు.

రోడ్డు భద్రతా చర్యలను పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా చర్యలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని అడిషనల్ ఎస్పీ ఎ.సుబ్బరాజు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి అడిషనల్ ఎస్పి సుబ్బరాజు తెలియజేశారు. ఫాటల్ యాక్సిడెంట్స్ జరగకుండా నిరోధించడానికి ఏపీఎస్ఆర్టీసీ తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రశంసించారు. అనంతరం చిత్రలేఖనం వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను ఏఎస్పీ అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా రవాణా అధికారి వీరయ్య చౌదరి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె ఎస్ ఎన్ ప్రసాద్, డీసీహెచ్ఎస్ ఎం.వీరస్వామి, డిపో మేనేజర్ ఎస్ గిరిధర్ కుమార్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

రక్తదాన శిబిరం

రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎ.వీరయ్య చౌదరి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్వి శివరామ భద్రరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణాన్ని నిలపడమేనని అత్యవసర పరిస్థితులలో ఒకరు దానం చేసిన రక్తం ముగ్గురి ప్రాణాలను నిలుపుతుందని ఆయన అన్నారు. రక్త దానం చేసిన ఆర్టీసీ ఉద్యోగులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ ఎల్ గీతా వాణి, భీమవరం డిపో మేనేజర్ ఎస్ గిరిధర్ కుమార్, తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. సుమారు 60 మంది వరకు ఉద్యోగులు రక్తదానం చేశారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎ.వీరయ్య చౌదరి

అన్ని వర్గాల సంక్షేమమే జగన్ లక్ష్యం

సాక్షి, భీమవరం: గత మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి నిరంతరం రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో గురువారం శ్రీనివాస్, ప్రసాదరాజులు అభివృద్ధి అంశాలపై చర్చించారు. అనంతరం చీఫ్ విప్ ప్రసాదరాజు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికలలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతానికి పైగా అమలు చేశారన్నారు. భీమవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం మండలాధ్యక్షుడు పేరిచర్ల విజయనర్సింహారాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

ఘనంగా జంతు పరిరక్షణ పక్షోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా పశు సంవర్ధక శాఖ, జిల్లా జంతు పరిరక్షణ సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న జంతు పరిరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా కేజీఆర్ఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులతో సదస్సు ర్యాలీ నిర్వహించారు. జంతు పరిరక్షణ మానవ కర్తవ్యం పై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరినాథ్ బాబు మాట్లాడుతూ జంతువులను ప్రేమించడం మానవ ధర్మమని అన్నారు. పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ మూగ జీవావలైన జంతువులకు సేవ చేయడంలో తృప్తి ఉంటుందన్నారు. జంతువులు రోడ్డుపై ప్రమాదం జరిగితే 1962 నెంబర్ కు సంప్రదిస్తే వైద్యం అందిస్తామని అన్నారు. ఇటీవల కాలంలో అనేక ప్రాంతాల్లో రేబిస్ ఇంజక్షన్ లను ఉచితంగా అందిస్తున్నమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 4 పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించామని, 134 మంది పాల్గొన్నారని, ముగింపు వేడుకల్లో బహుమతులు అందిస్తామని తెలిపారు. గోవులను జంతువులను పరిరక్షించడంలో 4 ఏళ్లుగా విశేష సేవలు అందిస్తున్న సుంకర దాసును సత్కరించారు. కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ ప్రిన్సిపల్ ఎవి గంగాధర్, జువాలజి హెడ్ చాయా దేవి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎ.జ్యోతి, సుధాకర్, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.


సుంకర దాసును సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరులో..

పాలకోడేరు: మోగల్లు గ్రామంలో గురువారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్స్ వ్యాక్సిన్‌లు వేశారు. పశువైద్యాధికారి డాక్టర్ ప్రియాంక రాబర్ట్ మాట్లాడుతూ ర్యాబీస్ వ్యాధి రాకుండా పెంపుడు కుక్కలకు, ఇతర పశువులకు రేబిస్ వ్యాధి టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈనెల 15 వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వి.మహాలక్ష్మి, ఏఎన్ఎం ఉషా సుందరం తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో జగనన్న లక్ష్యం సాధిద్దాం

ఆకివీడు: సమన్వయం, సమైక్యత, నిబద్ధతతో పని చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ లక్ష్యాన్ని సాధిద్దామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు పిలుపునిచ్చారు. మండలంలోని చినకాపవరం, సిద్ధాపురం, ఆకివీడులలో వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథల సమావేశం గురువారం ఆయా గ్రామాల్లో నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీవీఎల్ మాట్లాడుతూ మూడున్నరేళ్లలో సీఎం జగన్ పరిపాలనలో అందించిన సంక్షేమ పథకాలు ప్రజలకు వలంటీర్లు నిస్వార్థంగా నిజాయితీగా అందజేశారని చెప్పారు. వారి సేవలతోనే వలంటీర్ల వ్యవస్థ దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని చెప్పారు. ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాలు పొందిన లబ్ధిదారులకు పార్టీ పరంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలకు మళ్లీ ఒకసారి గుర్తు చేసేందుకే కన్వీనర్లు, సారథులు నియమించారని చెప్పారు. వీరి నియామకం వల్ల వలంటీర్ల వ్యవస్థకు ఏ విధమైన ముప్పు రాదన్నారు. ఎవరు ఎవరి మీద పెత్తనం చెలాయించడానికి ఈ వ్యవస్థను రూపొందించలేదని పీవీఎల్ చెప్పారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, పడాల శ్రీనివాసరెడ్డి, అంబటి రమేష్, మోరా జ్యోతి, గుండా సుందరరామనాయుడు,జీ.ధనరాజు, శిరపు శ్రీనివాస్, షేక్ అరుణ కుమారి, గాలి సామ్రాజ్య, మన్నే లలితాదేవి, కేశిరెడ్డి దుర్గారావు, కఠారి రాము, కత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలి

సాక్షి, భీమవరం: టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. భీమవరంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన నిర్వహించి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ళు గడుస్తున్నా నేటికీ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లను స్వాధీనం చేయడం లేదన్నారు. నేటికీ అద్దె ఇళ్లల్లోనే లబ్ధిదారులు అద్దెలు చెల్లిస్తూ కాలం గడుపుతున్నారన్నారు. ఒకవైపున అద్దెలు కడుతూ, మరోవైపున ఇళ్లకు తెచ్చిన రుణాలకు వడ్డీలు కడుతూ విపరీతమైన రుణభారం మోస్తున్నారన్నారు. తక్షణం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సీహెచ్.బాబురావు, కేతా గోపాలన్, బి.వాసుదేవ రావు, కర్రి నాగేశ్వరరావు, ఎ.అజయ కుమారి, గొర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

11న జాతీయ మెగా లోక్ అదాలత్


సాక్షి, భీమవరం: జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, మూడవ అదనపు జిల్లా జడ్జి పి శ్రీసత్యాదేవి అన్నారు. గురువారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జడ్జి మాట్లాడారు. రాష్ట్రీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో ఈ నెల 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. గతంలో మీడియా, ప్రజల సహకారంతో 848 కేసులను పరిష్కరించగలిగమన్నారు. ప్రజలలో కోర్టులపై ఉన్న భయాన్ని తొలగించుకుని గౌరవం కలిగే విధంగా లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలన్నారు. చిన్న చిన్న సమస్యలను తక్కువ సమయంలో పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. భీమవరంలో ఐదు కోర్టుల్లో దాదాపు 5,496 పెండింగ్ కేసులలో 1,202 కేసులను రాజీ చేసే దిశగా గుర్తించినట్లు జడ్జి శ్రీసత్యాదేవి చెప్పారు. ప్రజల్లో లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించేందుకు నాలుగు న్యాయ విజ్ఞాన సదస్సులు, పారా లీగల్ వలంటీర్లు ద్వారా 10 గ్రామాల్లో ఇంటింట కార్యక్రమాలు, నాలుగు పర్యాయాలు పోలీస్ అధికారులతో సమావేశాలను నిర్వహించామన్నారు. విలేకరుల సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి పాల్గొన్నారు.


భీమవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శ్రీసత్యాదేవి, అప్పలస్వామి

తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

ఉండి: పంటపొలాల మధ్య చెరువులను తవ్వేందుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలంటూ ఉండి మండలానికి చెందిన పెదపుల్లేరు, చినపుల్లేరు, కాళ్ల మండలానికి చెందిన సీసలి రైతులు గురువారం ఉండి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు, ఆర్ఐ వి.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఉండి గ్రామ శివారు కలిసిపూడి గ్రామ సరిహద్దులో ముగ్గురు రైతులకు చెందిన సుమారు 20 ఎకరాలల్లో ఆక్వా చెరువులు తవ్వేందుకు అధికారులు అనుమతులివ్వడం దారుణమన్నారు. చెరువుల తవ్వకం వల్ల చెరువుల వ్యర్థాలు నేరుగా సీసలి పాత పంటకాలువ ద్వారా సీసలి, చినపుల్లేరు గ్రామాల ప్రజల తాగునీరు కలుషితం కావడంతో పాటు పెదపుల్లేరు గ్రామంలో కూడా పంట పొలాలు నాశనం అవుతాయన్నారు. చెరువులకు అనుమతులిచ్చేముందు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం లేదని మండిపడ్డారు.

హెల్మెట్‌తోనే ప్రాణాలకు రక్షణ


హెల్మెట్ ధరించడం వల్ల వచ్చే ప్రయోజనాల్ని వివరిస్తున్న జిల్లా ఎస్పీ రవి ప్రకాష్

ఆకివీడు: హెల్మెట్ ధరించడం వల్ల ద్విచక్ర వాహన చోదకుల ప్రాణాలకు రక్షణ ఉంటుందని జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ చెప్పారు. హెల్మెట్‌పై ప్రత్యేక డ్రైవ్‌ను స్థానిక ప్రధాన సెంటర్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్పీ వాహన చోదకులతో మాట్లాడుతూ వెయ్యి రూపాయల హెల్మెట్ ప్రాణాల్ని కాపాడుతుందని చెప్పారు. లక్షల వ్యయంతో ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసే వ్యక్తులు హెల్మెట్ కొనుగోలులో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. హెల్మెట్ డ్రైవ్ ప్రతి రోజూ రెండు గంటల పాటు జిల్లా అంతా నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.రాజారెడ్డి పాల్గొన్నారు.

చెరుకువాడలో..

ఉండి: హెల్మెట్ లేని డ్రైవింగ్‌తో వాహనదారులకు ప్రాణాపాయమని ఎస్సైకె.గంగాధరరావు తెలిపారు.గురువారం ఉండి మండలం చెరుకువాడలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, సీఐ గీతాకృష్ణ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ డ్రైవ్‌ను నిర్వహించారు.హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కలిగే ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీవిజ్ఞానవేదిక సెయింట్ మేరీస్ ఆధ్వర్యంలో గురువారం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాచువారి సెంటర్ నుంచి గునుపూడి సోమేశ్వర స్వామి వారి దేవస్థానం వరకూ ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కాగిత వెంకటరమణ మాట్లాడుతూ మహాత్ముని ఆశయాలు నెరవేర్చడం మనందరి సామాజిక బాధ్యత అని, సెయింట్ మేరీస్ లేప్రసి సెంటర్ కుష్టు వ్యాధిగ్రస్తులకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్ మెంట్ ఏడీ ఎం.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇటువంటి వ్యాధులపై అవగాహన కల్పించడం గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం జ్ఞానరాజు, సెయింట్ మేరీస్ లెప్రసి సెంటర్ డైరెక్టర్ సిస్టర్ ఏల్విరా, ఏఓ ఆకుల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మాజీ మంత్రి వట్టికి పీవీఎల్ నివాళులు


వట్టి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీవీఎల్

కాళ్ల: మాజీమంత్రి వట్టి వసంత కుమార్ మృతికి డిసిసిబి చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సంతాపం తెలియజేశారు. ఈ మేరకు గురువారం పూళ్ల సమీపంలోని ఎంఎం పురంలో వసంత కుమార్ నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మరణం తీరని లోటని, కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు.

జగనన్న భూ సర్వే పరిశీలన


ప్రాతాళ్లమెరక గ్రామంలో భూరీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో దాసిరాజు

కాళ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని ఆర్డీవో దాసిరాజు పరిశీలించారు. ఇప్పటికే మండలంలోని కోపల్లె, వేంపాడు, జక్కరం గ్రామాల్లో ఇప్పటికే రీ సర్వే కార్యక్రమం పూర్తయింది. ప్రస్తుతం పెదఅమిరం, ప్రాతాళ్లమెరక గ్రామాల్లో పనులు ప్రారంభించారు. ప్రాతాళ్లమెరక గ్రామంలో చేపట్టిన రీసర్వే పనులను గురువారం భీమవరం ఆర్డీవో దాసిరాజు క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. రీసర్వేలో భాగంగా గ్రామంలో గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్ ఏర్పాటు చేశారు. తద్వారా వేగవంతంగా భూ రీసర్వే నిర్వహించనున్నట్లు కాళ్ల తహసీల్దార్ టీకే కృష్ణారావు తెలిపారు. వీరి వెంట ఆర్ఐ రాఘవమూర్తిరాజు, వీఆర్వో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అయిభీమవరంలో..

ఆకివీడు: జగనన్న సంపూర్ణ భూ హక్కు, భూ రక్షణ పథకంను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని భీమవరం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలో గురువారం డ్రోన్ ద్వారా భూముల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే నిబద్ధతతో, నిజాయితీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో ఎస్.వెంకటేశ్వరరావు, సర్వేయిర్లు పాల్గొన్నారు.

నౌడూరులో..

వీరవాసరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని నౌడూరు సర్పంచ్ నల్లమిల్లి వేణుక అన్నారు. తహసీల్దార్ ఎం.సుందర్రాజు ఆధ్వర్యంలో వీరవాసరం మండలం నౌడూరులో చేపట్టిన డ్రోన్ సర్వేను సర్పంచ్, రైతులు తిలకించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మానుకొండ ప్రదీప్‌కుమార్, రీ సర్వే డీటీ నాగేశ్వరరావు, కార్యదర్శి వసంత వాణీ ప్రసాద్, సర్వేయర్ ఇందిరా శైలజ, ఆర్ఐ రూజ్‌వెల్ట్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర పోషక యజమాన్యం పాటించాలి

ఆకివీడు: వరి సాగులో సమగ్ర పోషక యజమాన్య పద్ధతులు పాటిచడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని ఆత్మ ఏడీఏ శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద గురువారం రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నీటి యాజమాన్య, ఎరువుల యాజమాన్య పద్ధతులతో పాటు పురుగు మందుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ఏడీఏ కే.శ్రీనివాసరావు మాట్లాడుతూ రబీ సాగులో రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రియాంక, రైతులు నంద్యాల చల్లారావు, చీకటి నారాయణరావు, రాజనాల వీర్ల వెంకన్న పాల్గొన్నారు.